# సాక్షి సూర్యాపేట

ఆదివారం । 7 । జనవరి । 2024






## ఏసీబీ సోదాలు

నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాత్రి 9 గంటల వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. - 8లో



## వైభవంగా 'స్వాతి' పూజలు

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వాతి నక్షత్ర పూజలను వైభవంగా నిర్వహించారు. - 10లో



## శ్రీవారి సేవలో 'భట్టి'

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క శనివారం బరాఖత్‌గూడెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. - 10లో

# 4.22 లక్షల దరఖాస్తులు

## ముగిసిన ప్రజా పాలన గ్రామ సభలు

- అభయహస్తం కింద 3,62,203
- ఇతర దరఖాస్తులు 60,610
- ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రేషన్ కార్డులకు భారీగా..
- 475 పంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల్లో గ్రామ, వార్డు సభలు
- చివరి రోజు 40,271 స్వీకరణ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం కింద ఆరు గ్యారంటీ పథకాలకు ఎనిమిది రోజుల నుంచి నిర్వహించిన ప్రజా పాలనలో అధికారుల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, తెల్లరేషన్ కార్డులకు ప్రజలు అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. చివరి రోజు కూడా దరఖాస్తులు భారీగా వచ్చాయి. దరఖాస్తుల ప్రక్రియను ప్రతిరోజూ జిల్లా కలెక్టర్ వెంకట్రావు పర్యవేక్షించారు. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా 40,271 దరఖాస్తులు అందాయి.

**58 బృందాలు.. 3,425 కౌంటర్లు..**

జిల్లాలోని 475 గ్రామ పంచాయతీలు, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల్లోని 141 వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. డిసెంబర్ 28న ప్రారంభించిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగిసింది. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 58 బృందాలు 3,425 కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల ప్రక్రియ పరిశీలనకు తహసీల్దార్లు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బృందాలను జిల్లా యంత్రాంగం నియమించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోనివారు సంబంధిత మండల, మున్సిపాలిటీ కార్యాలయాల్లో సైతం దరఖాస్తులు చేసుకునేలా ఏర్పాటు చేసి స్వీకరించారు.



జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో అధికారులకు దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

**దరఖాస్తు చేసిన కుటుంబాలు 90 శాతంపైనే..**

జిల్లాల్లో ప్రజాపాలన సభలకు అనూహ్య స్పందన లభించింది. ప్రతి గ్రామం, మున్సిపాలిటీలో సుమారు 90 శాతానికి పైగా కుటుంబాలు ఆరు గ్యారంటీల్లో ఏదో ఒకదానికి దరఖాస్తు చేసుకున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 4,22,813 దరఖాస్తులు అందాయి. ఇందులో ఆరు గ్యారంటీలకు 3,62,203 దరఖాస్తులు రాగా అభయహస్తంతో సంబంధం లేని ఇతర పథకాల కోసం ప్రజలు 60,610 దరఖాస్తులు అందాయి

**మొదలైన కంప్యూటరీకరణ**

ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్ని కంప్యూటరీకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం జిల్లా కేంద్రాల్లో డేటా ఆపరేటర్లకు శుక్రవారం శిక్షణనిచ్చారు. అనంతరం మండలాలు, మున్సిపాలిటీల్లో ఆపరేటర్లు బృందాలుగా ఏర్పడి దరఖాస్తుల వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను మొదలుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబంధిత అర్జీదారు మొబైల్ నంబర్‌కు సంక్షిప్త సందేశం పంపించనున్నారు. ఈనెల 17 వరకు కంప్యూటరీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. సంక్రాంతి లోపే దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తిచేసేలా అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

**గ్రామాల్లో దరఖాస్తుల వివరాలు..**

| నియోజకవర్గం | అభయహస్తం కింద | ఇతర దరఖాస్తులు |
|---|---|---|
| హుజూర్‌నగర్ | 85,146 | 14,230 |
| కోదాడ | 77,531 | 15,166 |
| సూర్యాపేట | 56,974 | 10,448 |
| తుంగతుర్తి | 65,183 | 14,373 |
| మొత్తం | 2,84,834 | 54,217 |

**మున్సిపాలిటీల్లో..**

| మున్సిపాలిటీ | అభయహస్తం | ఇతర దరఖాస్తులు |
|---|---|---|
| హుజూర్‌నగర్ | 11,368 | 667 |
| కోదాడ | 20,895 | 23 |
| నేరేడుచర్ల | 3,854 | 836 |
| సూర్యాపేట | 35,062 | 3,123 |
| తిరుమలగిరి | 6,190 | 1,744 |
| మొత్తం | 77,369 | 6,393 |

### పకడ్బందీగా డేటా ఎంట్రీ



సూర్యాపేటలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శనివారం సూర్యాపేట మున్సిపాలిటీలో చేపట్టిన డేటా నమోదు కార్యక్రమాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 100 టీమ్స్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారుల సమక్షంలో దరఖాస్తుల డేటా ఎంట్రీ చేయిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 23,258 దరఖాస్తులను ఎంట్రీ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, మెప్మా పీడీ రమేష్‌నాయక్, ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కబడ్డీ ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టు సభ్యులతో ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు

- కలెక్టర్ వెంకట్రావు
- ముగిసిన ఇంటర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్

సూర్యాపేట టౌన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ చివరి రోజు శనివారం జరిగిన ఫైనల్ పోటీలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక వ్యాయమంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన వారు నిరుత్సాహ పడకుండా మళ్లీ గెలవాలనే తపన, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సొసైటీ పరిధిలో ఉన్న కళాశాలల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, బ్యాట్‌మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో 20 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ పి.హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ చంద్రజీత్‌సింగ్, అడ్వయిజర్ మంజిత్ రెడ్డి, కన్వీనర్ ఎం.రాజశేఖర్, జాయింట్ గవర్నర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి, కళాశాల సెక్రటరీ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ ఎం.రాజు, డైరెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ వెంకట్రావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు

## న్యూస్‌రీల్

### దరఖాస్తు గడువు పొడిగింపు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): 2023–24 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దయానందరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తూ ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని అర్హులైన ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్ట్ మెట్రిక్ హార్డ్ కాపీలను ఈనెల 12లోగా జిల్లా కార్యాలయంలో అందించాలని సూచించారు.

### తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలి



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

కోదాడ: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను తప్పులు లేకుండా సకాలంలో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మునగాల తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. డేటా ఎంట్రీ ప్రక్రియను స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

### టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా గజ్జల వెంకట్‌రెడ్డి



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఉమ్మడి నల్లగొండ జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక ఉత్తర్వుల లేఖ అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా పార్టీలో వివిధ బాధ్యతలు స్వీకరించి సేవలందిస్తున్నందుకు తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తన నియామానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలిపారు.

### కోదాడ మున్సిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపు

కోదాడ: కోదాడ మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగంలో ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా ఎంపికైనట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా కోదాడ పట్టణంలో సులభ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుతో పాటు ప్రతిఒక్కరూ తమ ఇంట్లో మరుగుదొడ్డి నిర్మాణం చేసుకొనే విధంగా చేయడం వల్ల ఈ గుర్తింపు లభించిందని ఆయన పేర్కొన్నారు. దీనికి కృషి చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ భవాని, సిబ్బందిని అభినందించారు.

### 8న జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు

సూర్యాపేట టౌన్: యువజన దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి వక్తృత్వ (ఉపన్యాస) పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రవీణ్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మై భారత్ –వికసిత భారత్ 2047 అనే అంశంపై జిల్లా స్థాయి డిక్లమేషన్ (వక్తృత్వ) పోటీ ఉంటుందని, ఈ పోటీకి 15 నుంచి 29 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. కేవలం 7నిమిషాల సమయంలో సంబంధిత అంశం మీద ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషల్లో ప్రసంగించాలని తెలిపారు. జిల్లాస్థాయిలో గెలిచిన యువతకు ప్రశంసా పత్రం, మెమొంటో అందజేయడంతోపాటు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ రూ.25వేలు ఇద్దరికి అందిస్తారని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనదల్చిన యువత ఆదివారం సాయంత్రం 5 గంటల లోపు సెల్ : 9052798602 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

# కక్షిదారులతో సామరస్యంగా మెలగాలి



కోర్టు ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి రాజగోపాల్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల: కోర్టుల్లో కక్షిదారుల పట్ల సామరస్యంగా మెలగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. వివిధ కోర్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇటీవల పరీక్ష రాసి ఎంపికైన వారికి శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ ఎంతో శ్రమపడి సాధించిన ఉద్యోగంలో బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు సేవ చేసే అవకాశం పవిత్రమైన న్యాయవ్యవస్థలో క్రమశిక్షణతో ఉండాలన్నారు. డ్రెస్‌కోడ్‌తోపాటు కోర్టుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా వృత్తిధర్మాన్ని పాటించాలన్నారు. ఈ సందర్భంగా కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్, సూర్యాపేట కోర్టుల్లో నియమితులైన స్టెనోగ్రాఫర్లు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సిబ్బంది మొత్తం 43 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, జ్యూడిషియల్ సిబ్బంది మధు, బ్రహ్మారెడ్డి, సంజయ్, ఆంజనేయులు, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

### మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

భానుపురి (సూర్యాపేట): మున్నూరు కాపులంతా రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని మున్నూరు కాపు మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్ అన్నారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన మహాసభ జిల్లా సమావేశంలో న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రామస్వామి శ్రీనివాస్ నాయుడు, సందీప్, దేగల రమేష్, రాంబాబు, వెంకటేశ్వర్లు, నవీను, శ్రవణ్, అశోక్, సతీష్, మధు పాల్గొన్నారు.





క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## డేటా ఎంట్రీని పక్కాగా చేపట్టాలి

చిలుకూరు: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా మత్స్య శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి రూపేందర్‌సింగ్ అన్నారు. శనివారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీల ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 17వ తేదీలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్

### 8న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

భానుపురి (సూర్యాపేట): జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 8వ తేదీన అంధుల లిపి నిర్మాత లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని జ్యోతి పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అంధులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థినులతో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బాల భవన్ నిర్వాహకులు

- జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్

సూర్యాపేట టౌన్: రాబోయే తరానికి ఆరోగ్యకరమైన సమాజం నిర్మించాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో తెలంగాణ రాష్ట్ర నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంపై 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు డ్రామ, మోనో యాక్షన్ అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి దినచర్యలో కూరగాయలు, ఇతర సామగ్రి రవాణాకు ప్లాస్టిక్‌ను వాడకుండా క్లాత్ సంచులను వినియోగించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. డ్రామా పోటీలో మొదటి బహుమతి బాలికల ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి అనంతగిరి మండలం పాలవరం జెడ్పీహెచ్‌ఎస్, తృతీయ ఎంఎస్సార్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు, మోనో యాక్షన్‌లో ప్రథమ నూతనకల్ కేజీబీవీ, ద్వితీయ నడిగూడెం టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, తృతీయ జిల్లా కేంద్రంలోని నంబర్ 2 ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. వీరికి ప్రథమ బహుమతి రూ.3వేల నగదు, ద్వితీయకు రూ.2వేలు, తృతీయ రూ.వెయ్యి నగదుతోపాటు షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ టి.రాధిక, టి.రాధిక, రాజశేఖర్, బాల కేంద్రం సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వంద శాతం ఫలితాల దిశగా..

- కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- పది, ఇంటర్‌లో మెరుగైన గ్రేడ్ల సాధనకు..
- ఈ ఏడాది నుంచే సీపీటీ పద్ధతి అమలు

హుజూర్‌నగర్: అనాథలు, తల్లిదండ్రులు లేని వారితోపాటు చదువు మధ్యలో మానేసిన, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ప్రత్యేక విద్యాబోధన చేసేందుకు ఏర్పాటు చేసిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాలో ఉన్న 18 కేజీబీవీలు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 82 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అయితే ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంట్లో భాగంగా విద్యార్థినులు సాధించిన మార్కుల ప్రకారం ఏ, బీ, సీ గ్రేడ్లుగా గుర్తించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం కేజీబీవీలు | 18 |
| జూనియర్ కళాశాలలు ఉన్నవి | 05 |
| టెన్త్ విద్యార్థినుల సంఖ్య | 638 |
| 6నుంచి9 వరకు | 2,809 |
| ఇంటర్ ఫస్టియర్‌లో | 158 |
| సెకండియర్‌లో | 103 |



మేళ్లచెరువు కేజీబీవీలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులు

**రెండు నెలకోసారి పరీక్ష**

కేజీబీవీల్లో పదో తగరతితోపాటు ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, వృత్తివిద్యకు సంబంధించి ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో విద్యను అభ్యసించే వారిపై విద్యా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రెండు నెలలకు ఒకసారి ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ) టెస్ట్, ఐదు నెలలకు ఒకసారి చేపట్టే సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) టెస్ట్‌లతో పాటు అదనంగా వీరికి సీపీటీ (సైకిల్ పార్ట్ టెస్ట్)లను నిర్వహిస్తూ తర్ఫీదునిస్తోంది. ఆయా నెలల్లో పూర్తయిన విషయాల్లోని అంశాలపై పరీక్షలు జరిపి, పునశ్చరణ చేసి వారి ప్రగతిని తెలుసుకునేలా అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

**ఉత్తమ ఫలితాలు సాధించాలని..**



గత విద్యా సంవత్సరం కేజీబీవీ విద్యార్థినులు పది, ఇంటర్ వార్షిక ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈఏడాది అంతకన్నా మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో సైకిల్ పార్ట్ టెస్ట్ (సీపీటీ) పద్ధతి అమలు చేస్తున్నాం. ఆయా నెలలో పూర్తైన పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థినులకు పునశ్చరణ కానుంది. అలాగే పరీక్షలంటే భయం పోతుంది. ఎఫ్‌ఏ, ఎస్‌ఏలతో పాటు సీపీటీని చేపట్టడంతో విద్యార్థినులకు ఎంతో మేలు జరుగుతుంది.

– అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

**విద్యార్థినులను గ్రేడ్లుగా విభజించి..**

కేజీబీవీల్లో చదివే పది, ఇంటర్ విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు వారికి విషయాల వారీగా ఒక్కో ప్రశ్న పత్రంలో 20 మార్కుల చొప్పున ప్రశ్నలు ఇవ్వనున్నారు. వాటిలో సాధించిన మార్కులతో సదరు విద్యార్థినులను గ్రేడ్లుగా విభజించేలా దిశానిర్దేశం చేశారు. ఆయా విద్యార్థినుల్లో 16కు పైగా మార్కులు వచ్చిన వారిని ఏ గ్రేడ్‌గా, 7నుంచి 16 మార్కుల మధ్య మార్కులు సాధించిన వారిని బీ గ్రేడ్‌గా, 7 మార్కులు వచ్చిన వారిని సీ గ్రేడ్‌గా గుర్తించనున్నారు. వెనుకబడిన వారి విషయంలో ప్రత్యేకత కనబర్చడం, వారి విద్యాభ్యున్నతికి తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను వారికి విషయ నిపుణులు వివరించనున్నారు. అలాగే నెల వారీగా సమీక్ష సమావేశాలను టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌ల రూపంలో అధికారులు సంబంధిత సీఆర్టీలు, పీజీ సీఆర్టీలకు వివరించనున్నారు. ప్రస్తుతం ఐదో సీపీటీ పూర్తయింది. మొత్తానికి సబ్జెక్టులపై పూర్తి స్థాయిలో పట్టు సాధించేలా, పరీక్షలంటే భయం తొలగించేలా, ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలో తెలియడంతోపాటు అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

## క్లుప్తంగా

### శతాధిక వృద్ధురాలు మృతి


కాంతమ్మ (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన బైరబోయిన కాంతమ్మ(100) వయోభారంతో శనివారం తెల్లవారు జామున మృతిచెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలు కాంతమ్మ ఇప్పటికే తన వంశానికి చెందిన మూడు తరాల వారిని చూసింది. మొన్నటి వరకు ఆరోగ్యంగానే ఉందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు

- క్రీస్తు సందేశాన్ని వినిపించిన కార్డినల్ పూల ఆంథోని
- రెండో రోజు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


కేతేపల్లి : వేడుకలో ప్రసంగిస్తున్న కార్డినల్ పూల ఆంథోని

కేతేపల్లి: కేతేపల్లిలోని మేరి జపమాల మాత చర్చిలో క్రీస్తు సాక్షాత్కార (ముగ్గురు రాజుల పండుగ) ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం స్థానిక చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక చర్చి విచారణ గురువు మాదాను ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లోని వివిధ చర్చిలకు చెందిన 100మంది క్రైస్తవ మత గురువులు, మత కన్యలు, ఏసు క్రీస్తు భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్డినల్ పూల ఆంథోని క్రీస్తు సందేశాన్నిచ్చారు. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన ఏసు ప్రభువు లోక రక్షకుడని అన్నారు. దేవుడే క్రీస్తు రూపంలో జన్మించి మానవ కల్యాణానికి పాటుపడ్డారని పేర్కొన్నారు. క్రీస్తు సందేశాలు పాటిస్తే శుభాలు కలుగుతాయని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు పాటించి నిర్మల జీవితాన్ని గడపాలన్నారు. పార్థనల అనంతరం క్రైస్తవులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. వేడుకల్లో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యయ్య, మాదాను బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌రాజు, విజయ్‌కుమార్, పసల దనరాజ్, పాలిశెట్టి జోజప్ప, శౌరి, గుద్దింటి రాయప్ప, క్రైస్తవులు బందా లూబెల్, కాల్వ శౌరయ్య, పసేల రవి, జార్జి, అవ్వారి రాయప్ప పాల్గొన్నారు.

**జాతరకు భారీగా తరలి వచ్చిన ప్రజలు**

ముగ్గురు రాజుల పండుగ సందర్భంగా స్థానిక చర్చిలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా చర్చి ఆవరణలో పెద్ద జాతర నడుస్తోంది. చర్చి వెలుపల వెలిసిన పిల్లల ఆటల వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, తిను బండారాలు, తదితర దుకాణాలతో వీధి కిక్కిరిసి పోయింది. జాతరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. చర్చిలో ప్రత్యేకంగా నిర్మించిన మేరి మాత విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ మేరి మాత విగ్రహాన్ని, ఏసు శిలువను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు.

# తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- భూమి పట్టా మార్పిడి కేసుకు రైతును డబ్బులు డిమాండ్ చేసిన తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు
- కార్యాలయంలో రాత్రి వరకు అధికారుల సోదాలు
- పలు రికార్డులు స్వాధీనం.. సీనియర్ అసిస్టెంట్‌పై కేసు


ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్

నకిరేకల్ : భూమి మార్పిడి కోర్టు కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి 9గంటల వరకు ఏసీబీ అధికారులు తహసీల్దార్ కార్యాయంలో సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన కిష్టయ్యకు సర్వే నంబర్ 15/2లో ఉన్న రెండు ఎకరాల భూమిని తనకు రాసిచ్చారని, తన పేరిట ధరణిలో పట్టా చేయాలని అదే గ్రామానికి చెందిన కిష్టయ్య అల్లుడు శ్రీనివాస్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. అధికారులు పట్టా మార్పిడి చేయకపోవడంతో శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించాడు. ఆ భూమిని శ్రీనివాస్ పేరిట పట్టా చేయాలని కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అయితే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో శ్రీనివాస్ మళ్లీ కోర్టును ఆశ్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న కిష్టయ్య కుమారుడు కొమ్మనబోయిన వెంకటేష్ కూడా కోర్టులో కేసు వేశాడు. ఈ క్రమంలోనే ధరణిలో పట్టా చేయాలని కోరుతూ కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకన్నను సంప్రదించాడు.

**కోర్టు ఖర్చులకు రూ.65 వేలు కావాలని..**

కంటెమ్ట్ కేసు విషయంలో అనుకూలంగా తీర్పు రావాలంటే కోర్టులో కార్యాలయ పరంగా కేసు వేయాల్సి ఉంటుందని సీనియర్ అసిస్టెంట్ వెంకన్న తెలిపాడు. కోర్టు ఖర్చులకు రూ.65వేలు కావాలని వెంకటేశ్‌ను డిమాండ్ చేశాడు. దీంతో సదరు బాధితుడు వెంకటేశ్ ఏసీబీ అధికారులకు వారం క్రితమే ఫిర్యాదు చేయగా అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో పూర్తి ఆధారాలు సేకరించేందుకు నల్లగొండ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు రామారావుల నేతృత్వంలో అధికారులు శనివారం నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేశారు. సంబంధిత సీనియర్ అసిస్టెంట్ వెంకన్న దగ్గర ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.





## బైక్‌ల అపహరణ కేసులో ఇద్దరి అరెస్ట్

కొండమల్లేపలి : బైక్‌ల అపహరణ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. శనివారం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వీరబాబులు నిందితుల వివరాలు వెల్లడించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన బోడ యాదయ్య బైక్‌ను గత ఏడాది అక్టోబర్ 27న గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు తిప్పర్తి మండలం కాజీరామారం గ్రామానికి చెందిన గంటె కంపు మధుకుమార్, కోదాడకు చెందన కారం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. వీరు నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా మరో బైక్‌ను అపహరించినట్లు విచారణలో ఒప్పుకున్నారు. వారి వద్ద రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. సమావేశంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, హేమానాయక్, గురువారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

కొండమల్లేపలి : చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో నివాసముంటున్న రమావత్ పూల్‌సింగ్ ఇంట్లో జనవరి 1న గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.90వేల నగదును అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న దేవరాయ సత్యనారాయణను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

## బస్సును ఢీకొట్టిన లారీ.. ఆరుగురికి గాయాలు

మోతె : లారీ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తోంది. మార్గమధ్యలో మామిళ్లగూడెం వద్ద ముందు వెళ్తున్న డీసీఎం టైరు పగిలిపోయింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వేగనియంత్రణ కాక వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించి బస్సును రోడ్డు పక్కకు దించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

## ప్రజాపాలన దరఖాస్తులను పక్కాగా ఎంట్రీ చేయాలి

సూర్యాపేట రూరల్ : ప్రజాపాలన దరఖాస్తులను పక్కాగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూర్యాపేట జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం సూర్యాపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీలో అవతవకలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పరంకుశరావు, ఏపీఓ వెంకన్న, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


వేములపల్లి : క్రేన్ సహాయంతో లారీని బయటికి తీయిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి, వేములపల్లి, తిప్పర్తి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన పాల సంఘం మాజీ చైర్మన్ ముద్దం రామచంద్రం తన సోదరుడు అంజయ్యతో కలిసి బైక్‌పై రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో అక్కెనపల్లి గ్రామ శివారుకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రం అక్కడికక్కడే మృతిచెందగా ఆయన సోదరుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

**లారీ బోల్తా పడి క్లీనర్ మృతి**

వేములపల్లి : లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో క్లీనర్ మృతిచెందగా డ్రైవర్, మరో క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బేకరీకి సంబంధించిన ముడి పదార్థాలతో ఓ లారీ నెల్లూరు నుంచి ముంబాయికి బయలుదేరింది. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రంలోని గంగదేవమ్మ గుడి వద్ద అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన లారీ క్లీనర్ వాన్వె ఆశీశ్‌బాలు (18) అక్కడికక్కడే మృతిచెందగా మరో క్లీనర్ దోత్రె రాహుల్, లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని తొలుత మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు బోల్తాపడిన లారీని క్రేన్ సహాయంతో బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

**తిప్పర్తిలో కారు డ్రైవర్..**

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ పట్టణం బంగారిగడ్డకు చెందిన మహ్మద్ ఆసిఫ్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం తండ్రి మరణించడంతో నిద్ర చేసేందుకు శుక్రవారం తల్లి సుల్తానాను హైదరాబాద్‌లో బంధువుల వద్ద దించేందుకు కారులో వెళ్లాడు. తిరిగి శనివారం మిర్యాలగూడకు వస్తుండగా అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కల్వర్టులో బోల్తా పడింది. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా చౌటుప్పల్ వద్ద మృతిచెందాడు. భార్య బీబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# మాజీ మంత్రి జగదీష్‌రెడ్డే.. 420


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను 420 అంటున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి.. జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఆయనే అసలు 420 అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరేశం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వ నిర్మాణం కోసం తన బీనామిలకు కాంట్రాక్ట్ ఇప్పించుకుని ఆ ప్రాంత ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా జగదీష్‌రెడ్డి మోసం చేశారని, ఈ విషయంలో తాను బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. జిల్లా మంత్రిగా ఉండి నక్కల గండి సొరంగమార్గం పనులు ఒక్క అంగుళం కూడా చేయలేదన్నారు. 'మూసలమ్మ చెట్టు ఎత్తిపోతల పథకాన్ని సంవత్సరం లోపు పూర్తి చేయకుంటే మా మంత్రి జగదీష్‌రెడ్డి రాజీనామా చేస్తాడు' అని నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో స్వయంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఆ పనులు పూర్తికాలేదన్నారు. దానికి బాధ్యత వహిస్తూ జగదీష్‌రెడ్డి రాజీనామా చేయాల్సి ఉండగా.. చేయలేదని, ఇప్పుడు తమ ప్రభుత్వం మీద ఆరోపణలు చేసే అర్హత జగదీష్‌రెడ్డికి ఎక్కడిదని వీరేశం ప్రశ్నించారు. జలహారతి పేరుతో కాళేశ్వరం జలాలు తీసుకవచ్చి సస్యశామలం చేస్తామని చెప్పినా జిల్లాకు చుక్క నీరూ ఇవ్వలేదని ఆరోపించారు. కృష్ణ, గోదావరి, మూసీ నదులను అనుసంధానం చేస్తామని చెసినా దాని ఊసేలేదన్నారు. 'కాంగ్రెస్ హామీలను 420 హామీలు అంటున్న నీవు.. ఆ విషయాలపై ఇద్దరం రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్దాం. నీ మెజారిటీ కంటే ఒక్క ఓటు తక్కువ వచ్చినా నేను ఎన్నిక నుంచి తప్పుకుంటాను' అని వీరేశం సవాల్ విసిరారు. నకిరేకల్ మున్సిపాలిటీలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని, ఆ పనుల్లో కూడా అవినీతి జరిగిందని, కేటీఆర్ కూడా 420 అని ఆరోపించారు. ప్రజల దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, నెల రోజుల్లోనే రెండు స్కీంలను అమలు చేశామన్నారు. మిగతా పథకాల కోసం ప్రజా పాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే స్వీకరిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తప్పుడు విమర్శలు చేస్తే సహించబోమని అన్నారు. విలేకరుల సమావేశంలో చామల శ్రీనివాస్, పూజర్ల శంభయ్య, దైద రవీందర్, పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

# ఆకు కూరల సాగుకు సమయమిదే

- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- తక్కువ సమయంలో పంట చేతికి


పాడి పంట

పెద్దవూర: భారత ఆహార సంస్థ, వైద్య పరిశోధన మండలి సిఫార్సుల మేరకు ప్రతి ఒక్కరూ కనీసం 125 గ్రాముల ఆకు కూరలు ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాలి. వీటిలో ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. విటమిన్ ఏ, సీ, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అందుతాయి. బావులు, బోర్లు, ఇతర నీటి పారుదల కింద ఆకుకూరల సాగును ఆరుతడి పద్ధతిలో తక్కువ నీటితో సాగు చేపట్టడం ద్వారా అధిక లాభదాయకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. ఈ నెల నుంచి ఆకుకూరల సాగు చేపట్టవచ్చునని తెలిపారు.

**సాగు చేయాల్సిన ఆకుకూరలు ఇవే..**

పాలకూర, తోటకూర, గోంగూర, చుక్కకూర, మెంతికూర, పుదీన, కొత్తిమీర, బచ్చలికూర ప్రస్తుతం సాగు చేసేందుకు అనుకూలంగా ఉంటాయి. తోటకూరలో ఏఆర్‌ఎస్‌పి రకం మంచి దిగుబడి వస్తుంది. విత్తిన 15–20 రోజులకే మొదటి కోత వస్తుంది. ఆర్క ఆరుణ, కో–1,2,3 రకాలను సాగు చేయవచ్చు. పాలకూరలో ఆల్‌గ్రీన్ రకం మేలైనది. ఇది విత్తిన 15–20 రోజుల్లోనే కోతకు వస్తుంది. 6 నుంచి 7కోతల్లో ఎకరాకు 50 టన్నుల ఆకు దిగుబడి వస్తుంది. ఆర్క అనుపమ కూడా సాగు చేయవచ్చు. మెంతికూరలో లాంసెలక్షన్–1 రకం గుబురుగా పెరుగుతుంది. ఎక్కువ ఆకు దిగుబడిని ఇస్తుంది. పూసాఎర్లీ బించింగ్ రకం కూడా తొందరగా కోతకు వస్తుంది. హిస్సార్ సువర్ణరకం కూడా పూసాఎర్లీ బంచింగ్ కంటే 20 శాతం అధిక దిగుబడి వస్తుంది. గోంగూరలో ఏఎన్‌జీఆర్ యూ–1 రకం ఎకరాకు 4–5 టన్నుల దిగుబడి వస్తుంది. ఎంఎస్–3 రకం కూడా ఎర్ర గోంగూర రకానికి చెందినదే. దీనిని కూడా తడికింద ఎప్పుడైనా సాగు చేయవచ్చు. కొత్తిమీరలో స్వాతి(సీఎస్–6) పంట కాలం 80–85 రోజులు ఉంటుంది. సాధన (సీఎస్–4) రకం పంటకాలం 100–110 రోజులు ఉంటుంది. ఇది బెనుబంకను తట్టుకుంటుంది. వీటితో పాటు కరివేపాకులో సువాసిని, డిడబ్ల్యూ 1–2 రకాలు, బచ్చలిలో ఎర్ర బచ్చలి, పుదీనాలో స్పియర్‌మింట్ వంటి రకాలు సాగుకు అనుకూలం.


తుంగతుర్తిలో సాగవుతున్న పాలకూర


సాగవుతున్న పుదీనా తోట

**దిగుబడి పెంచడానికి మార్గాలు**

తక్కువ కాలపరిమితి, అధిక దిగుబడులు ఇచ్చే రకాలు ఎంపిక చేసుకోవాలి. సమగ్ర ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్‌ను ఉపయోగించి విత్తన శుద్ధి చేయాలి. విత్తిన 20 రోజుల నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు కలుపు తీసి మట్టిని కదిలించాలి. విత్తే ముందు ఫ్లక్లోరిలిన్ కలుపు మందును ఎకరాకు 800 గ్రాములు వాడాలి. ఆకు కూరల సాగుకు సాధ్యమైనంత ఎక్కువగా సేంద్రియ ఎరువులను వాడితే నేలలో తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచి సూక్ష్మజీవుల చర్యలు అధికమై పోషకాల లభ్యత పెరుగుతుంది. విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మరలా మూడోరోజు కూడా నీరు పెట్టాల్సి ఉంటుంది. భూమిలో తేమను బట్టి 5–7 రోజులకు తడి ఇవ్వాలి. విత్తిన మొదటిసారి నీరు పెట్టేటప్పుడు జాగ్రత్తగా నెమ్మదిగా నీరు పెట్టాలి. నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రెండు శాతం యూరియా అంటే లీటరు నీటికి 20 గ్రాములు కలిపి చల్లాలి. తోటకూర సాగుకు 800 గ్రాములు, పాలకూరకు 10–12 కిలోలు, గోంగూరకు 6 కిలోలు, మెంతికూరకు 8–10 కిలోలు, కొత్తిమీరకు 4.5 కిలోలు, బచ్చలికూర సాగుకు 5–6 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి.

**విత్తే పద్ధతి..**

పాలకూర సాగుకు వరుసల మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య దూరం 10సెం.మీ. ఉండాలి. గోంగూరకు వరుసల మధ్య దూరం 30సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 10 సెం.మీ.లు, తోటకూరలో వరుసల మధ్య దూరం 20 సెం.మీ. మెంతికూరలో వరుసల మధ్య దూరం 25 సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 10 సెంటీమీటర్లు, బచ్చలికూరలో వరుసల మధ్య 60 సెం.మీ.లు, మొక్కల మధ్య దూరం 60 సెం.మీ.ల దూరం ఉండాలి.

## క్లుప్తంగా

### డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు స్వాగతం



డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కలిసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

**సూర్యాపేట రూరల్‌ :** హైదరాబాద్‌ నుంచి ఖమ్మం వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట పట్టణంలోని 7 ఫుడ్‌ కోర్టులో ఆగిన తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు శనివారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్‌ కౌన్సిలర్‌ బైరు శైలేందర్‌గౌడ్‌, పట్టణ అధ్యక్షుడు ఎండీ అంజద్‌ అలీ, మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ కక్కిరేణి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

### మురుగు సమస్య పరిష్కారం

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెంలోని కొత్తగూడెం రోడ్డు వెంట పొలాల్లో మురుగు నీరు చేరి గత కొన్నేళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌ వెంటనే నిధులు మంజూరు చేయించి కాలువ నిర్మించడానికి చొరవ చూపారు. దీంతో ఎమ్మెల్యే సామేలుకు యువజన కాంగ్రెస్‌ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి మధూకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కృషితో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు.

### సీతారామాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**మోతె :** తుమ్మలపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో శనివారం కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లారావు, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, పార్టీ నాయకులు అరుణమ్మ, మేదరమెట్ల వెంకటనారాయణ, మాజీ సర్పంచ్‌ నర్సయ్య, కార్యకర్తలు వాసంశెట్టి రామారావు పాల్గొన్నారు.

### వైభవంగా దర్పనోత్సవం



దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం దర్పనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజోపచర్యలు జరిపారు. అలాగే చతుర్వేద పారాయణం, ఛత్రం, చామరం, ఆదర్శనం, ఉపచర్యలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి కుంకుమార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్‌, పవన్‌ కుమార్‌, భక్తులు పాల్గొన్నారు.

### నిధులు విడుదల చేయాలి

**తుంగతుర్తి :** గత ప్రభుత్వం మంజూరు చేసిన దళిత బంధు నిధులను విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని లబ్ధిదారుడు కొండగడుపుల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు దళితబంధు లబ్ధిదారులు ఉన్నారు.

### క్రీడాకారుడికి అభినందన

**మోతె :** నామవరం గ్రామానికి చెందిన కత్తుల సాల్మన్‌రాజు బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమం, నేషనల్‌ లెవల్‌లో మూడవ స్థానంలో ఛాంపియన్‌గా నిలిచినందున కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌ పద్మావతి శనివారం అతడిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి వెళ్లి జాతీయ స్థాయిలో రాణించడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

### ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే

**అర్వపల్లి :** కొమ్మాల, కొత్తగూడెం ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వపల్లి భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు ఇందు, వినీత మాట్లాడుతూ ఈ నెల 10 వరకు సర్వే జరుగుతుందని చెప్పారు. దివ్యాంగులు, మానసిక వైకల్యం కలిగిన పిల్లలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. వారికి భవిత కేంద్రాల ఆధ్వర్యంలో అర్థమయ్యే రీతిలో బోధన అందించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లయ్య, ఉపాధ్యాయురాలు జయసుధ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో హెచ్‌ఎం

# ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు

- చివరి రోజూ భారీగా దరఖాస్తులు
- మొదలైన ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియ



సూర్యాపేట మున్సిపాలిటీలో దరఖాస్తులను ఆన్‌లైన్‌ చేస్తున్న సిబ్బంది



తిరుమలగిరి : తాటిపాములలో దరఖాస్తు చేసుకుంటున్న గ్రామస్తులు

**తిరుమలగిరి :** గత నెల 28వ తేదీ నుంచి కొనసాగుతున్న గ్రామపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. చివరి రోజున తిరుమలగిరి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మున్సిపల్‌ కమిషనర్‌ దండు శ్రీనివాస్‌, మండల పంచాయతీ అధికారి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

**జాజిరెడ్డిగూడెం మండలంలో 10,449..**

**అర్వపల్లి :** రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు శనివారం ముగిశాయి. జాజిరెడ్డిగూడెం మండలంలోని 17 గ్రామపంచాయతీల నుంచి మొత్తం 10,449 దరఖాస్తులు వచ్చాయని మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్‌, తహసీల్దార్‌ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీఓ సందీప్‌కుమార్‌ తెలిపారు. అలాగే గ్రామసభల సందర్భంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తుల డేటా నమోదు కార్యక్రమం కూడా చేపట్టినట్లు చెప్పారు. తహసీల్దార్‌, ఎంపీడీఓ కార్యాలయాల్లో డేటా ఎంట్రీ జరుగుతుందని తెలిపారు.

**పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్‌ కోరారు. శనివారం పర్సాయపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ పుప్పాల శేఖర్‌, ఎంపీటీసీ రాచకొండ గీతాసురేష్‌, ఎంపీఓ సందీప్‌కుమార్‌, ఏఈ అశోక్‌, పశువైద్యాధికారి అర్జున్‌, కార్యదర్శి అంజయ్య, ఉప సర్పంచ్‌ ధనుంజయ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన**

**మద్దిరాల :** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను శనివారం నుంచి ఆన్‌లైన్‌ చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌ చేస్తున్న దరఖాస్తులను డీఆర్‌డీఓ పీడీ కిరణ్‌కుమార్‌ పరిశీలించారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌ చేయాలని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ రాజేష్‌, ఏపీఓ గుండు వెంకన్న, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**చివ్వెంల :** ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్‌ అన్నారు. శనివారం పాశ్యానాయక తండాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేదల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ రంగారావు, ఎంపీడీఓ ఎల్‌. లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్‌ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌ కోరారు. శనివారం మండల పరిధిలోని న్యూబంజారా హిల్స్‌ తండాలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ భిక్షం, ఏఓ కృష్ణ సందీప్‌, ఏపీఎం అజయ్‌నాయక్‌, ఏపీఓ రవి, ఆర్‌ఐ మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

**డేటా నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి**

మండలంలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల డేటా నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారులు రాంపతి, రమేష్‌ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌, ఎంపీడీఓ కార్యాలయాల్లో చేపట్టిన డేటా నమోదు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. మొదటి రోజు మండల వ్యాప్తంగా 1200 దరఖాస్తులను ఎంట్రీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్‌, తహసీల్దార్‌ మహేందర్‌రెడ్డి, ఏఓ కృష్ణసందీప్‌, ఎంపీఓ నరేష్‌, ఏపీఎం అజయ్‌నాయక్‌, ఏపీఓ రవి, ఆర్‌ఐలు స్వప్న, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

**తుంగతుర్తి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కలిపి 14,376 దరఖాస్తులు వచ్చినట్లు భీంసింగ్‌ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**నాగారం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.శోభారాణి మాట్లాడుతూ గ్యారంటీ పథకాలకు మండలంలో 10,020 దరఖాస్తులు, రేషన్‌ కార్డులు, ఇతర వాటికి 2,136 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆమెతోపాటు సిబ్బంది ఉన్నారు.



మద్దిరాలలో దరఖాస్తుల ఆన్‌లైన్‌ నమోదు నిర్వహిస్తున్న సిబ్బంది



చివ్వెంల : పాశ్యానాయక్‌ తండాలో దరఖాస్తుల స్వీకరణ..



పెన్‌పహాడ్‌ : డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న మండల అధికారులు



అర్వపల్లి : పర్సాయపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు




పెన్‌పహాడ్‌ : న్యూబంజారాహిల్స్‌ తండాలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



నాగారంలో దరఖాస్తులను సమర్పిస్తున్న గ్రామస్తులు

### విద్యావలంటీర్ల నియామక ప్రకటనపై హర్షం

**నాగారం :** వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని విద్యావలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు మల్లేపాక యాకయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనాకు ముందు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,600 మంది విద్యావలంటీర్లుగా పనిచేశారని అన్నారు. గత ప్రభుత్వం కరోనా సాకుతో 2020 నుంచి తమను విధుల్లోంచి తొలగించి అన్యాయం చేసిందని తెలిపారు. విద్యా వలంటీర్లను రెన్యువల్‌ చేసి విధుల్లోకి తీసుకోవాలని ఎన్నిసార్లు విన్నవించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నూతన ప్రభుత్వం గతంలో పనిచేసిన విద్యా వలంటీర్లను రెన్యువల్‌ చేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో విద్యా వలంటీర్లు రేణుక, మల్లీశ్వరి, కవిత, గంగాధర్‌, సైదులు, లింగయ్య, అవిలయ్య, వసంత, మధు, పరమేశ్వర్‌ తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న జైభీమ్‌ సభ్యులు

**తిరుమలగిరి :** తాటిపాముల గ్రామానికి చెందిన వేముల మహేష్‌ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు జై భీమ్‌ యువజన సంఘం ఆధ్వర్యంలో రూ. 11 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్ర నరేష్‌, కోశాధికారి బాకి అరవింద్‌, హరీష్‌, శ్రీనివాస్‌, సుధాకర్‌, కుమార్‌, యాకస్వామి పాల్గొన్నారు.

### సామర్థ్యాలు పెంపొందించాలి

**నూతనకల్‌ :** విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాధికారి రాములు నాయక్‌ అన్నారు. శనివారం నూతనకల్‌ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మద్దిరాల, నూతనకల్‌, ఆత్మకూర్‌(ఎస్‌) మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగులో చదవడం, రాయడంతోపాటు తెలుగు వ్యాకరణాన్ని అభ్యసించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌ఫేర్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం



రంగోలిని పరిశీలిస్తున్న అధికారి దేవరాజ్‌

**సూర్యాపేటటౌన్‌ :** సైన్స్‌ఫేర్‌ వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందుతుందని జిల్లా సైన్స్‌ అధికారి ఎల్‌.దేవరాజ్‌ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏపీఎం పాఠశాలలో జన్య ఫౌండేషన్‌, సువెన్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రంగోలి, సైన్స్‌ఫేర్‌ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్‌, గణిత అంశాలను ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్‌ సిస్టర్‌ ఫాతిమ, జన్య సభ్యుడు శివకుమార్‌, వెంకట్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి తలంబ్రాల పంపిణీ



నాగారం : ఫణిగిరి రామాలయం నుంచి అయోధ్య రాముడి తలంబ్రాలను తీసుకెళ్తున్న భక్తులు



చివ్వెంలలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

**నాగారం :** అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న అయోధ్య రాముడి తలంబ్రాలు ఇటీవల ఫణిగిరి రామాలయానికి చేరాయి. ధర్మ జాగరణ కమిటీ ఆధ్వర్యంలో ఫణిగిరి నుంచి తలంబ్రాలను శనివారం నాగారం గ్రామానికి అందజేశారు. నాగారంలో నేటి నుంచి తలంబ్రాలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కూరేశం సంతోష్‌కుమార్‌, ధర్మ జాగరణ కమిటీ సభ్యురాలు అలివేలు మంగ, భక్తులు వంగూరి అంజయ్య, కన్నెబోయిన సంజీవ, అంజయ్య, లింగమల్లు, కేశవులు, నూక నరేష్‌, అనిల్‌ పాల్గొన్నారు.

**చివ్వెంల :** మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గుంపుల, జి.తిరుమలగిరి గ్రామాల్లో అయోధ్య రామ మందిర అక్షింతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమావత్‌ మంగ్తా నాయక్‌, గుగులోతు జైల్‌సింగ్‌ నాయక్‌, కంచర్ల రామిరెడ్డి, నాతాల పెద్ద అనంతరెడ్డి, నాతాల శేఖర్‌ రెడ్డి, రణబోతు జానకిరెడ్డి, కృష్ణారెడ్డి, బాబు, వెంకటాచారి, వీరయ్య, యాదయ్య, చలమంద, బక్కయ్య, నాగరాజు, నాగయ్య, నారాయణరెడ్డి, ఈశ్వరచారి, వెంకట్‌ రెడ్డి పాల్గొన్నారు.

## ఎల్‌ఐసీ నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ సైదులుగౌడ్‌

**నాగారం :** నాగారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో ఎల్‌ఐసీ నూతన సంవత్సర క్యాలెండర్లను స్థానిక ఎస్‌ఐ సైదులుగౌడ్‌ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్‌ఐసీ ప్రపంచంలో అత్యంత నమ్మకమైన సంస్థగా పేరుగాంచిందన్నారు. ఎల్‌ఐసీ పాలసీ పొంది ఉంటే వారి కుటుంబానికి రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఫైనాన్స్‌ అడ్వయిజర్‌, సూర్యాపేట బ్రాంచ్‌ ఏజెంట్‌ కడారి సోమయ్య, రెవరెండ్‌ డి.పురుషోత్తం, పాస్టర్లు బూర్గుల కమలాకర్‌, చింతపల్లి విజయ్‌, బడుగుల శ్రీకాంత్‌, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 200 క్వింటాళ్ల బియ్యం వితరణ



సోమనర్సయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

**తిరుమలగిరి :** అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠ మహోత్సవానికి గానూ సూర్యాపేట జిల్లా రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య 200 క్వింటాళ్ల బియ్యం (రూ.10 లక్షలు) అందజేశారు. శనివారం ఆయన తిరుమలగిరి మండల కేంద్రంలో అమర్‌నాథ్‌ సేవా సమితి సభ్యులకు బియ్యం అందించి మాట్లాడారు. రామ మందిర ప్రారంభోత్సవం, రాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో దేశ వ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు పాల్గొంటున్నారని తెలిపారు. అయోధ్యలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా బియ్యం అందజేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌ సేవా సమితి సభ్యులు సోమనర్సయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్‌ సేవా కమిటీ వ్యవస్థాపక చైర్మన్‌ చీకోటి మధుసూదన్‌, నిర్వాహకులు నల్ల చంద్రం, పాశం విశ్వనాథ్‌ పాల్గొన్నారు.

## దళిత బంధులో అవినీతిపై విచారణ జరిపిస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సామేల్‌



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నాయకులు

**తిరుమలగిరి :** తిరుమలగిరి మండలంలో దళితబంధు పైలట్‌ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పూర్తి విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్‌ తెలిపారు. శనివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత బంధు పథకంలో ఒక్కో యూనిట్‌లో లక్షల రూపాయల అవినీతి జరిగినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దళిత బంధు బాధితుల కోసం తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రత్యేకంగా ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులు తమ ఫిర్యాదును తహసీల్దార్‌ కార్యాలయంలోని బాక్సుల్లో వేయాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వై.నరేష్‌, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్‌, కౌన్సిలర్‌ గిలకత్తుల ప్రియలత రాముగౌడ్‌, బత్తుల శ్రీను, మూల అశోక్‌రెడ్డి, రాపాక సోమేష్‌, సుంకరి జనార్దన్‌ తదితరులు పాల్గొన్నారు.

**విస్తృత సమావేశానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం**

ఈ నెల 7వ తేదీన తిరుమలగిరి మండల కేంద్రంలో జరిగే టీఎస్‌యూటీఎఫ్‌ విస్తృత సమావేశానికి తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్‌ను శనివారం ఎమ్మెల్యే నివాస గృహంలో ఆ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఎన్‌.సోంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌, కోశాధికారి వెంకటయ్య, ఎస్‌.సోమయ్య, లాలు, వెంకన్న, సీహెచ్‌.సోమయ్య, వెంకటాద్రి, నాగేశ్వరరావు, సైదులు, మారయ్య, లాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**చివ్వెంల :** మార్గశిర మాసం స్వాతి నక్షత్రం సందర్భంగా ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్‌ అరవింద చార్యులు, శ్రీమాన్‌ క్రిష్ణమాచార్యులు, శ్రీమాన్‌ నల్లాచక్రవర్తుల రామక్రిష్ణామాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవిలతో కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్‌, బందకవి క్రిష్ణమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

## పంట చేలలో వానరాల బీభత్సం

- గుంపులుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్న కోతులు
- ఆందోళన చెందుతున్న ఆత్మకూరు మండల పరిధిలోని గ్రామాల రైతులు



ఆత్మకూరులో సంచరిస్తున్న కోతుల గుంపు

**ఆత్మకూర్‌ (ఎస్‌) :** మండల పరిధిలోని రైతులకు కోతుల బెడద తప్పడం లేదు. ఎక్కడ చూసినా వందల సంఖ్యలో వానర సైన్యం పంటలపై దాడికి పాల్పడుతోంది. మండలంలోని ఏ గ్రామంలో చూసినా రైతులు ఇదే సమస్యతో ఇబ్బందుల పాలవుతున్నారు. నిత్యం కాపాడుకుంటూ వస్తున్నా ఏదో ఒకరోజు కోతులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి పైరును సైతం వదలడం లేదని అంటున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా కంది, వేరుశనగ, పెసర, ఇతర ఆరుతడి పంటలు ఉన్నాయి. రైతులు ఏ మాత్రం గమనించకపోయినా పంటలపై కోతులు దాడి చేసి ధ్వంసం చేసే పరిస్థితులు నెలకొన్నాయి. కోతులన్నీ గుంపులుగా పెద్ద సంఖ్యలో వస్తుండడంతో వాటిని బెదరగొట్టడం కూడా ఇబ్బందిగా మారుతోంది. ఒకవేళ ఒక్కరే ఉండి తరిమే ప్రయత్నం చేస్తే దాడి చేసి గాయపరుస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం నలుగురు, ఐదుగురు రైతులు కలిసి బెదిరిస్తే గాని కోతుల గుంపు వెళ్లడం లేదు. ఎన్నిసార్లు తరిమినా మరుసటి రోజు మళ్లీ పంట చేల వద్దకు చేరుకుంటున్నాయని రైతులు తెలుపుతున్నారు. దీంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతులను పట్టించి అడవులకు తరలించాలని, పంటలను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**రోజూ వస్తున్నాయి**



ఎకరం విస్తీర్ణంలో వేరుశనగ పంట వేశాను. ప్రస్తుతం కాతదశలో ఉంది. కొద్దిరోజులుగా కోతుల గుంపు చేను వద్దకు వస్తోంది. పొలిమేర దాటించినా ఫలితం ఉండడం లేదు. పంట చేతికి వచ్చే దాక నమ్మకం ఉండడం లేదు.

– వినవరం రాంరెడ్డి, రైతు

### టాలెంట్‌ టెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**కోదాడఅర్బన్‌ :** విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు టాలెంట్‌ టెస్ట్‌లు ఉపయోగపడతాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ డీఎస్పీ పి.ప్రకాష్‌ అన్నారు. గత నెల 17న ఏఐఎస్‌ఎఫ్‌, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్‌ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారికి శనివారం కోదాడలోని ఎస్‌ఆర్‌ఎస్‌ జూనియర్‌ కళాశాలలో డీఎస్పీ ప్రకాష్‌ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. నేటి విద్యార్థులే భావిభారత పౌరులని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. టాలెంట్‌ టెస్ట్‌లో ప్రథమ బహుమతి జయదేవ్‌ (శ్రీస్కూల్‌), ద్వితీయ బహుమతి యరగాని పవన్‌ (తేజ టాలెంట్‌), తృతీయ బహుమతి పత్తిపాటి కీర్తి (శ్రీవైష్ణవి కాన్సెప్ట్‌ స్కూల్‌), చతుర్థ బహుమతి కీర్తి భవ్య (శ్రీగ్లోబల్‌ హైస్కూల్‌,) పంచమ బహుమతి షేక్‌ అమీన్‌ (సైదయ్య కాన్సెప్ట్‌ స్కూల్‌), కన్సోలేషన్‌ బహుమతులు సాయివర్షిత (పాలె అన్నారం), విజయలక్ష్మి (కోమరబండ)లకు అందజేసినట్లు విద్యార్థి సంఘం నాయకుడు చేపూరి కొండలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, నాయకులు నరేష్‌, కళాశాల కరస్పాండెంట్‌ నాగేశ్వరరావు, వేణుగోపాల్‌, నాగరాజు, రామారావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

### ఫైర్‌ లెస్‌ వంటకాల ప్రదర్శన

**కోదాడఅర్బన్‌ :** కోదాడ పట్టణంలోని న్యూవిజన్‌ పాఠశాలలో శనివారం ఫైర్‌ లెస్‌ వంటకాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులతో వివిధ ఆహార పదార్థాలను నిప్పు లేకుండా స్వయంగా తయారు చేయించారు. నిప్పు లేకుండా వండిన ఆహార పదార్థాల్లో ఉండే పోషకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్‌ కార్తీక్‌రాజా మాట్లాడారు. ఆకలి సమస్య, ఇంధన శక్తిని పొదుపు చేయడం, ప్రపంచ వ్యాప్తంగా ఆహారాన్ని ఎలా వృథా చేస్తున్నారో తెలపడం, జంక్‌ ఫుడ్‌కి దూరంగా ఉండడం, పోషకాహారం ప్రాధాన్యం తదితర అంశాలను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు.